# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేదీ : 09-09-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్‌లో వరద, భారీ వర్షాలపై ప్రజల ఫోన్ నెంబర్లకు హెచ్చరిక సందేశాలను పంపించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు.**
2. **కాకినాడ జిల్లా ఏలేరు జలాశయాన్ని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె పవన్ కల్యాణ్ ఈరోజు పరిశీలించనున్నారు.**
3. **వరద ప్రభావిత ప్రాంతాల్లో రేషన్ కార్డులు లేకున్నా నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తామని ఆంధ్రప్రదేశ్ చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు.**
4. **తెలంగాణలో వరద ప్రభావిత జిల్లాల్లో వైద్యసేవలకు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని వైద్య,ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు.**
5. **వాయుగుండం ప్రభావంతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో రానున్న రెండు రోజుల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది.**

==========================

ఆంధ్రప్రదేశ్‌లో బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో వర్షాలు కురుస్తున్నందున ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారులను అప్రమత్తం చేశారు. నిన్న విజయవాడలో జిల్లాల కలెక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించి ఆయా జిల్లాల్లో పరిస్థితులు, నమోదైన వర్షపాతం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత పరిస్థితులు, తీసుకుంటున్న చర్యలు, సన్నద్ధతను కలెక్టర్లు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, జిల్లాలలో నమోదైన వర్షపాతాన్ని అంచనా వేసుకుని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జలాశయాల్లోకి వచ్చే నీరు, విడుదల చేసే నీటిని సమన్వయం చేసుకుని ప్రాజెక్టుల నిర్వహణ చేపట్టాలని, కాలువలు, చెరువులకు గండ్లు పడకుండా చూడాలని తెలిపారు. భారీ, అతిభారీ వర్షాలు కురిసే ప్రాంతాల్లో తాగునీరు, ఆహారం, వైద్య శిబిరాల ఏర్పాటుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. పునరావాస కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించడం సహా.. వరద ప్రభావిత ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. వరద, భారీ వర్షాలపై ప్రజల ఫోన్లకు హెచ్చరిక సందేశాలను పంపించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ జిల్లా ఏలేరు జలాశయానికి వరద ఉధృతి పెరుగుతుండటంతో అధికారులతో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ సమీక్షించారు. నిన్న అమరావతి నుంచి శ్రవణ మాధ్యమం ద్వారా

జిల్లాలో పరిస్థితులు, సహాయక చర్యలను గురించి జిల్లా కలెక్టర్‌ను పవన్ కల్యాణ్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ, 24 టీఎంసీల సామర్థ్యం ఉన్న ఏలేరు జలాశయానికి ఇప్పటికే 21 టీఎంసీల నీరు చేరిందన్నారు. దీంతో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భారీ వర్షాలు పడుతున్న క్రమంలో ఉప్పాడ ప్రాంతంలోని ప్రజలకు అవసరమైన సహాయక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వరద ముంపు ప్రభావం ఉండే ప్రాంతాల్లో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేస్తున్నట్టు ఉపముఖ్యమంత్రి వెల్లడించారు. ఇలా ఉండగా.. పవన్ కళ్యాణ్ ఈ రోజు కాకినాడలో పర్యటించి ఏలేరు పరిధిలోని ముంపు ప్రాంతాలను పరిశీలిస్తారని అధికారులు వెల్లడించారు.

---------------------------

బుడమేరు గండ్లు పూడ్చిన ప్రాంతంలో గట్లను ఎత్తు పెంచేందుకు చర్యలు చేపడుతున్నామని ఆంధ్రప్రదేశ్ జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో బుడమేరు ఆధునీకరణ పనులను మంత్రి నిన్న పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మరో రెండు రోజుల పాటు భారీ వర్ష సూచనలున్న నేపథ్యంలో గండ్లు పూడ్చిన దగ్గర గట్టు ఎత్తు పెంచాలని ముఖ్యమంత్రి సూచించారని చెప్పారు. పులివాగు నుంచి బుడమేరుకు వరద ప్రవాహం కొనసాగుతోందని, వర్షం వల్ల మరమ్మత్తులకు ఆటంకం ఏర్పడుతోందని అన్నారు. గట్లను మరింత బలోపేతం చేయడానికి, బుడమేరు లోతు తెలుసుకునేందుకు అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు..

---------------------------

వరద ప్రభావిత ప్రాంతాల్లో రేషన్ కార్డులు లేకున్నా నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తామని ఆంధ్రప్రదేశ్ చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని పాత రాజరాజేశ్వరి పేటలో పారిశుద్ధ్య పనులను మంత్రి నిన్న పరిశీలించారు. అనంతరం నిత్యావసర సరుకులను స్థానికులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వరద భాదితులకు రాష్ట్ర ప్రభుత్వం 6 రకాల నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తోందని తెలిపారు. బాధితులందరికీ నిత్యావసర సరుకులు అందిస్తామన్నారు. రెండ్రోజుల్లో కాలువల్లో మురుగు తొలగిస్తామని, రహదారులను, ఇళ్లను అగ్ని మాపక యంత్రాలతో శుభ్రం చేయిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

రహదారులపై ట్రాఫిక్ ఒత్తిడిని తగ్గించి, ప్రమాదాలు నివారించే విధంగా పైవంతెనలను నిర్మించాల్సిన అవసరం ఉందని ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం మోరంపూడి జాతీయ రహదారిపై నూతనంగా నిర్మించిన పైవంతెనను రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరితో కలిసి మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా కందుల దుర్గేష్ మాట్లాడుతూ, రద్దీ ప్రదేశాల్లో పైవంతెనలను నిర్మించడం ద్వారా రహదారి ప్రమాదాలను తగ్గించవచ్చని అన్నారు. పైవంతెనపై వాహనాల రాకపోకలు ప్రారంభించిన అనంతరం సర్వీసు రహదారిని కూడా అభివృద్ధి చేయనున్నామని మంత్రి తెలుపుతూ,

వాయిస్ (21 సెకన్లు)

---------------------------

తెలంగాణలో వరద ప్రభావిత జిల్లాలైన ఖమ్మం, భద్రాద్రి-కొత్తగూడెం, మహబూబాబాద్, ములుగు, సూర్యాపేట జిల్లాల్లో వైద్యసేవల్లో అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్ర వైద్య,ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి ఆయా జిల్లాల ఆరోగ్య పరిస్థితులపై మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. వరదలు, భారీ వర్షాల నేపథ్యంలో ఆయా జిల్లాల ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సదుపాయాలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గర్భిణుల ఆరోగ్యం, ఔషధాల నిల్వలు, ఆసుపత్రులకు విద్యుత్ సరఫరా, అందుబాటులో అత్యవసర వాహనాలు, టీకాలు, పారిశుద్ధ్యం వంటి అంశాలపై అప్రమత్తంగా ఉండాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

---------------------------

"తెలుగు భాషే మన అస్తిత్వమని" ఎలుగెత్తి చాటిన ప్రజాకవి.. స్వాతంత్ర్య సమరయోధులు, 'పద్మవిభూషణ్' కాళోజీ నారాయణరావు జయంతిని ఈరోజు తెలంగాణా భాషా దినోత్సవంగా జరుపుకుంటున్నారు. 1914 సెప్టెంబరు 9వ తేదీన కర్ణాటకలోని బీజాపూర్ జిల్లాలోని రట్టిహళ్లి గ్రామంలో జన్మించిన ఆయన... తెలుగు, హిందీ, ఉర్దూ, మరాఠీ, కన్నడ, ఇంగ్లీషు భాషల్లో పలు రచనలు చేశారు. తన రచనల ద్వారా నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడారు. రాజకీయ వ్యంగ్య కవిత్వం రాయటంలో ప్రసిద్ధిచెందిన కాళోజీ నారాయణరావు పలు రచనలు చేసి ప్రజాకవిగా గుర్తింపు పొందారు. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని జైలు జీవితాన్ని అనుభవించిన కాళోజీ నారాయణరావు 2002 నవంబరు 13వ తేదీన తుదిశ్వాస విడిచారు.

---------------------------

వాయుగుండం ప్రభావంతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో రానున్న రెండు రోజుల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్ లో రానున్న రెండు రోజుల్లో కోస్తాలోని శ్రీకాకుళం, మన్యం, విజయనగరం జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. దీంతో ఈ జిల్లాలకు ఎరుపురంగు ప్రమాద హెచ్చరికలు జారీ చేసింది. విశాఖపట్నం, అల్లూరి, సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, యానాంలలో ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని నారింజ రంగు హెచ్చరికను జారీ చేసింది. తీరం వెంబడి గంటకు 40 నుంచి 50 కిలోమీటర్లు గరిష్ఠంగా 70 కిలోమీటర్లు బలమైన గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది.

అలాగే తెలంగాణలోని కుమురం భీం అసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది. ప్రజలందరూ జాగ్రత్తలు పాటించాలని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది.

---------------------------

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈక్రమంలో విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల్లో ఈరోజు విద్యాసంస్థలకు సెలవు ప్రకటించినట్టు ఆయా జిల్లాల కలెక్టర్లు తెలిపారు. అలాగే విశాఖ కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. జిల్లాలోని వివిధ పోలీసు, తహసీల్దార్ కార్యాలయాల్లోనూ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామని, ప్రజలకు ఎలాంటి సహకారం కావాలన్నా, విశాఖ కలెక్టర్ కార్యాలయం కంట్రోల్ రూమ్ నెంబర్ 0891-2590102, మరొక నెంబర్ 0891-2590100, అలాగే విశాఖ పోలీసు కంట్రోల్ రూమ్ నెంబర్ 0891- 2565454తో పాటు 100, 112 నెంబర్లను సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.

======================